ప్రఖ్యాత క్రిమినల్ లాయరు ప్రభాకర్ లా పుస్తకాలు, జర్నల్స్ తిరగేసి తనకు అవసరమైన పాయింట్స్ నోట్ చేసుకున్నాడు.

తన ఇన్నేళ్ళ ప్రాక్టీసులో ఇప్పటి వరకు అతను ఎన్ని జటిలమైన కేసులు అంగీకరించినా, ప్రతికేసు కొత్తగానే వుంటుంది. ప్రతిసారి తను శ్రమకోర్చి డిఫెన్స్‌కు తయారవుతూనే వున్నాడు.

# ఆకాశంలో చంద్రుడు



—చిత్తూరి కోటేశ్వర రావు ఐ.పి.యస్.

ఆ ప్రయత్నంలోనే తెల్లవారిపోయింది. నిద్రలేమి అతన్ని ఏమీ చేయలేకపోయింది. అలసట అసలే అనిపించడం లేదు. కారణం తన కర్తవ్యం తనను వెన్ను తట్టి ప్రోత్సహిస్తూన్నది!

అప్పటికి పూర్తి చేసిన నోట్సు, అవసరమైన పుస్తకాలు ఫైల్‌లో కట్టి చకచక తయారయ్యాడు.

అతను కారు ఎక్కబోతుండగా, ఫైల్ పట్టకుని ప్లీడరు గుమస్తా హడావుడిగా అతని వెంట బయలుదేరాడు.

"నువ్వుండు పంతులూ, నేను అలా ఓ అరగంట బయటికి వెళ్ళొస్తాను, నువ్వు సరాసరి కోర్టుకి ఫైల్ తీసుకుని వచ్చేయి" అనేసి రివ్వున కారేసుకుని వెళ్ళిపోయాడు.

***

ఎన్నడూ లేనిది ఆ రోజు ప్రభాకర్ దిన చర్యలో ఏదో కొట్టవచ్చినట్టు మార్పు కనిపించడంతో పంతులు క్షణం ఆశ్చర్యంగా కారు వెళ్ళిన వేపే కన్నార్పకుండా చూసి, కోర్టుకు బయలుదేరాడు.

కోర్టు హాలులో అడుగుపెట్టిన ప్రభాకర్‌ని అంతా వింతగా చూశారు.

అతని నుదుట కుంకుమ బొట్టు వుంది. అంటే ప్రభాకర్ గుడికి వెళ్ళి, పూజా పునస్కారాలు చేసి మరీ కోర్టుకి వచ్చాడన్నమాట!

తన ప్రతిభ మీద అపారమైన విశ్వాసంగల ప్రభాకర్, ఆ రోజు గుడికి వెళ్ళడంలో వింతకన్నా విశేషమే వుంది. ఆ రోజు అతను వాదించబోయే కేసులో ముద్దాయికి శిక్ష తప్పించడంలో న్యాయ శాస్త్రంలో అతనికి వున్న నైపుణ్యం మీద అతనికి నమ్మకం సడలింది.

అసలు ఆ నేరస్తుని గురించి, నేరం గురించి తెలిసిన ఏ డిఫెన్స్ లాయరూ ఆ కేసును వాదించడానికి ఒక పట్టాన ఒప్పకోడు. ఆ కేసులో గెలుస్తారనే కంటే ఓడిపోతారని ఖచ్చితంగా చెప్పవచ్చు.

జడ్జి కోర్టులో ప్రవేశించడంతో అందరి ఆలోచనలకు అంతరాయం కలిగింది.

ఒక వ్యక్తికి తను తప్పు చేస్తున్నాననే భయం వుంటే అతనా తప్పు చేయలేడు. కాని తను తప్పు చేయలేదన్న ధైర్యమే అతన్ని ఆ తప్పు చేయడానికి పురిగొల్పింది.

ఆ తప్పే ఇప్పుడు రామూర్తి పాలిట యమపాశంగా మారింది. కారణం ఏదైనా ఒక స్త్రీ చనిపోయింది. ఆ చావు కూడా జనం భీతిల్లేట్లు వుంది. ఆ స్త్రీ నీచపు ప్రవృత్తి కలదే అవ్వొచ్చు. ఎవ్వరికైనా భారత రాజ్యాంగంలో సమానహక్కులు కల్పించబడ్డాయి. చట్టం ఎవ్వరికైనా ధన, మాన ప్రాణాల రక్షణ కల్పించవలసిందే.

ప్రాసిక్యూషన్ కథనాన్ని నిరాటంకంగా ఒప్పకున్న డిఫెన్స్ లాయరు ప్రభాకర్‌ని జడ్జి, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌తో సహా కోర్టులో వున్న మిగిలిన లాయర్లు అంతా వింతగా చూశారు.

అయితే అతని నిజాయితీని గుర్తించిన వాళ్ళు ప్రేక్షకుల గ్యాలరీలో లేకపోలేదు.

అతని ప్రతిభాపాటవాల మీద అపారమైన విశ్వాసం గల భారతి, ఉరఫ్ రామ్మూర్తి భార్య మాత్రం అన్నింటికి అతీతురాలిగా నిర్లిప్తంగా వుండిపోయింది.

జడ్జివాదప్రతివాదనలను నోట్ చేసుకుంటున్నాడు. సరిగ్గా అప్పడు ప్రభాకర్ కంఠం వణికింది. ఆ క్షణంలోనే అతని కళ్ళలో నీలి నీడలు చోటు చేసుకున్నాయి.

తననితాను కంట్రోల్ చేసుకోవడానికి తన శాయశక్తుల ప్రయత్నించాడు ప్రభాకర్. జీవితంలో ఇది అతని ఆఖరి పోరాటం.

"ఫర్ గివ్ మీ లార్డ్... ఒక ఆశయం కోసం నేనాడుతున్న నాటకాన్ని రక్తి కట్టించు తండ్రీ!" కనిపించని ఆ దేవుడిని చివరిసారిగా ప్రార్థించాడు.

ప్రభాకర్ నోటి నుంచి చివరిగా వెలువడే ఆర్గ్యుమెంట్ కోసం అందరూ వేయి కళ్ళతో ఎదురు చూస్తూ చెవులు రిక్కించుకుని మరీ వినడానికి వున్నారు.

"యువరానర్! స్త్రీలోలుడైన రామ్మూర్తిని నిర్దోషిగా పరిగణించమని నేనుకోరడం లేదు.కారణం అతను నేరం చేశాడు గనుక. కాని అతను ఏ నేరం చేశాడు? ఏ పరిస్థితులలో ఆ నేరం చేశాడో చెప్పడమే నా అభిమతం. చనిపోయిన స్త్రీని కించపరచడం నా అభిమతం కాదు. అందుకు కోర్టు నన్ను మన్నించాలి. విచ్చలవిడి శృంగారంతో, డ్రగ్స్‌కు అలవాటుపడి ఆమె, రామ్మూర్తితో వ్యభిచరించిన మాట వాస్తవం. ఆ మత్తులోనే ఆమె మోతాదుకు మించి డ్రగ్ తీసుకోవడంతో మరణించింది. రామ్మూర్తి ఆ రాత్రి ఆమెతో వుండగా ఆమె మరణించింది. ఎక్కడ ఆ నేరం తన మీద పడుతుందో, అది తెలిస్తే ఎక్కడ తన సంసారం చిన్నాభిన్నమౌతుందోనన్న భయమే అతన్ని నేరం చేయడానికి ప్రోత్సహించింది. ఆమె ప్రమాదవశాత్తు గ్యాస్ స్టవ్వు అంటుకుని మరణించినట్టు వంట గదిలో సృష్టించాడు. మెడికల్ సర్టిఫికెట్స్ ఆధారంగా ఆ విషయాలు రుజువయ్యాయి. అంటే రామ్మూర్తి శవానికి నిప్పపెట్టి ప్రాసిక్యూషన్‌ని తప్పదారి

పట్టించాడు. దానికి ఇండియన్ పీనల్‌కోడ్‌లో ఏ శిక్ష వుందో అది విధించాల్సిందే!

"బట్! మి లార్డ్! రామ్మూర్తే ఆమెకు ఎక్కువ మోతాదులో డ్రగ్ ఇచ్చి హత్యచేశాడనడానికి బలీయమైన కారణం అంటూ ఏమీ లేదు. ఆ అవసరం కూడా అతనికి లేదు. కాబట్టి కోర్టు అతన్ని హత్య కేసులో నిర్దోషిగా, ప్రాసిక్యూషన్‌ను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నించినందుకు దోషిగా పరిగణించవలసిందిగా మనవి చేసుకుంటున్నాను" తను చెప్పదలచుకున్న రెండు ముక్కలు చెప్పి కూర్చున్నాడు ప్రభాకర్.

ఇక ఈ కేసులో తనకు అనుకూలంగా తీర్పు వస్తుందన్న ఆశ ఏ మాత్రం లేని రామ్మూర్తి డీలా పడిపోయాడు.

తీర్పు కోసం జడ్జి కేసును రేపటికి వాయిదా వేశాడు. బార్‌రూమ్‌లో కూర్చున్న లాయర్ ప్రభాకర్ భారతి రాక కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాడు.

అప్పటికే భారతి కోర్టు ఆవరణ దాటి వెళ్ళిపోయింది. కోర్టులో తనవాదన విన్న భారతి తనని అపార్థం చేసుకుందా! అందుకే నిరాశకుగురి అయ్యి వెళ్ళిపోయిందా! ఆ ఆలోచనకే అతని మనసు విలవిలలాడింది. అప్పటి వరకు అలసట ఎరుగని అతను నిద్రలేమితో నీరసపడిపోయాడు. అతని మనసు పొరలలో గతం తాలూకు నీలినీడలు కదలాడాయి.

***

ఆ రోజు ఆదివారం.

సమయం సాయంత్రం ఐదు గంటలయింది. లాన్‌లో కూర్చున్న ప్రభాకర్ అడుగుల చప్పుడికి తలెత్తి చూశాడు.

ఎదురుగా శారద ఆమె కళ్ళు ఉబ్బి వున్నాయి. అతను క్షణం కలవరపడ్డాడు.

"శారూ ఏమయిందమ్మా! అలా వున్నావేమ్మా!" కంగారుగా అడిగాడు.

"అన్నయ్యా!" శారద బావురుమంది. ఆమె నోటి నుంచి మరి మాట పెగిలి రావడంలేదు.

ఆమెను కూర్చో బెట్టి సముదాయించడానికి ప్రయత్నించాడు.

ఆ పరిస్థితిలో అసలు విషయం ఏమిటో ఆమె ఎందుకు బాధపడుతుందో తెలుసుకోవడం కష్టమనుకున్నాడో ఏమో! మౌనంగా మంచినీళ్ల గ్లాసు చెల్లి చేతికి అందించాడు.

ఆమె మారుమాట్లాడకుండా నీళ్ళు గటగట తాగేసింది.

"ఇప్పుడు చెప్పమ్మా నువ్వు దేని గురించి బాధపడుతున్నావు?" ఆమె స్థిమిత పడిన తరువాత అడిగాడు.

"అన్నయ్యా! భారతి నీకన్యాయం చేసిందిరా!" ఆమె విషయం పూర్తిగా చెప్పకపోవడమో, అసలు భారతి ప్రస్తావన ఆ క్షణంలో తీసుకురావడం అతనికి ఇష్టం లేకపోవడమో—కారణం ఏదైనా అతని భృకుటి మాత్రం ముడివడింది.


భారతి, శారద క్లాస్‌మేట్స్. చెల్లిద్వారానే భారతి తనకి పరిచయం అయ్యింది. ఆ పరిచయం పరిచయం లాగానే వున్నా బావుండేది. కాని ఆ పరిచయంలో అపశ్రుతి దొర్లింది. అప్పటికే విషయం తెలిసి వేదాంతిలా గీత చదువుకుని తనకి తాను సర్ది చెప్పుకున్నా అతను చెల్లి ముందు బయటపడదలచుకోలేదు.

"నువ్వు అనవసరంగా ఏదేదో ఊహించుకుంటున్నావే! ఎవరన్నా వింటే అనవసరపు అపోహలకు దారి తీయవచ్చు. దయచేసి ఆ ప్రస్తావన మరెవ్వరి దగ్గరా తీసుకు రావొద్దు" చెల్లిని మందలించాడు.

శారద ఆశ్చర్యపోయింది.

అతను భారతిని ఎంతగా ప్రేమిస్తున్నాడో తనకి తెలుసు. కాని భారతి నిర్ణయం విని తను క్రుంగిపోయింది. రెండోపెళ్ళివాడైన రామ్మూర్తిని చేసుకోవడానికి తాంబూలాలు పుచ్చుకుంటుండగా భారతిని తను నిలదీసింది.

"అన్నయ్య నిన్ను ప్రేమిస్తున్నాడే! నీ మనసే నాకు అర్థం కాకుండా వుంది" కళ్ళ నీళ్ళు తిరిగాయి ఆ రెండు మాటలు నోటి నుంచి వూడిపడక ముందే శారదకి.



## తెల్ల మచ్చలు

మా వైద్యం ద్వారా పదిహేను గంటలలోనే వాటి రంగులో మార్పు ప్రారంభం. ఎన్నో సంవత్సరాల కృషి పరిశోధనల ఫలితంగా రూపొందిన ఈ మందు విజయవంతమైనది. ఇరువది ఒక్క రోజులలోనే తెల్ల మచ్చలు పూర్తిగా నివారించబడతాయి. పూర్తి నివారణ లభిస్తుందని ప్రతి రోగికి హామీ ఇస్తున్నాం. వేరే ఎచ్చటనైనా వైద్యం చేయించుకుంటూ ఫలితంలేక మీరు విసిగిపోయిననూ, 7 రోజులకు మందులు ఉచితం.

చికిత్స గ్యారంటీ.

**RANI**
**AYURVED (HAW)**
**P.O.: KATRI SARAI (GAYA)**

## నెరసిన జుట్టు

అకాలపు నెరపు నుండి మీ జుట్టును రక్షించుటకు ఆయుర్వేద వైద్యం ఎంతో మేలు. తెల్లని జుట్టు నల్లని జుట్టుగా మారుతుంది. జుట్టు రాలడాన్ని నివారిస్తుంది. వైద్యం కొరకు వెంటనే వ్రాయండి. ఒక సీసా రూ. 25/-, మూడు సీసాలు రూ. 70/-.

**RANI**
**AYURVED (H.A.T.)**
**P.O.: KATRI SARAI (GAYA)**


"బుల్‌షిట్! నా పెళ్ళి నా యిష్టం. మీ అన్నను ప్రేమిస్తున్నట్టు నేను ఏనాడైనా నీతో చెప్పానా..?"

ఆ ప్రశ్నకి శారద ఆవాక్కయింది.

అన్నంటే అయిష్టత వ్యక్తం చేయడంకన్నా, భారతి రెండో పెళ్ళివాడిని చేసుకుంటూందన్న విషయం శారదను ఎంతగానో బాధించింది.

భారతి మరొకరి సొత్తు అయిన క్షణం నుంచి ప్రభాకర్ ఆమెగురించి ఆలోచించడం మానేశాడు. కాని విధి వక్రిస్తుందని, భారతికి తను సహాయ పడాల్సిన పరిస్థితి వస్తుందని తనెప్పుడూ ఊహించనైనా ఊహించలేదు. తన బాధ్యతను నిర్వర్తించాడు.

కాని భారతి ఈ రోజు తనని అపార్థం చేసుకుంది. ఆ రోజు తనని కాదన్న నేరానికి తనామె భర్త మీద పరోక్షంగా కక్ష సాధిస్తున్నట్టు అభిమానవతి అయిన భారతి అనుకోవడంలో తప్పులేదు.

ఆలోచనలతో ఎప్పడు నిద్ర పట్టిందో! ఆ నిద్రలోనే గతం తాలూకు వ్యధనంతా మరో సారి అనుభవించాడు.

ఆ అనుభవం నుంచి ఇంకా కోలుకోక ముందే మేల్కొన్నాడు. మేల్కొన్న మరుక్షణాన్నే ఆ వార్త విని షాక్‌తిన్నాడు ప్రభాకర్.

అతని మనసు ఏదో కీడును శంకిస్తుండగా పోర్టికోలో నుంచి కారు తీశాడు.

***

ఎమర్జెన్సీ వార్డులో అడుగు పెట్టిన ప్రభాకర్‌కి శారద ఏడుపు వినిపించింది.

అప్పటికే అంతా అయిపోయింది.

'నన్ను నమ్ము భారతీ!

నేను ఇప్పటికీ, ఎప్పటికీ, మరెప్పటికీ నిన్ను నా హృదయమనే కోవెలలో ఆరాధిస్తూనే వున్నాను. ఉంటానుకూడా. నా దేవతకి నేను ద్రోహం తలపెడతానని ఎలా భ్రమించావు భారతీ!' పెదవులు దాటి రాని అతని మూగభాషను అతని ముఖ కవళికల్లో చదివిన రామ్మూర్తి అచేతనంగా భారతి రాసిన డైరీ ప్రభాకర్ చేతిలో పెట్టాడు.

వణుకుతున్న వేళ్ళతో ఆ రోజు పేజి తిప్పి చూసిన ప్రభాకర్ కొయ్యబారిపోయాడు.

"ఒక భార్యగా నేను రామ్మూర్తి ఈ కేసునుంచి బయట పడాలని కోరుకున్నా, ఓ స్త్రీగా అతడు చేసిన నేరాలని జీర్ణించుకోలేకపోతున్నాను. కట్నం తేలేదన్న మిషతో తన మొదటి భార్యను మంటలకు ఆహుతి చేసిన రామ్మూర్తిని కావాలని నేను వివాహం చేసుకున్నాను. కారణం- అతడు అంటే ఇష్టం వుండికాదు. రామ్మూర్తి తమ్ముడి వలలో పడి గర్భవతి అయిన నా చెల్లి జీవితాన్ని సరిదిద్దడం కోసం రామ్మూర్తికి ఎర అయిపోయాను.కాని ఈ రోజున యావత్ ప్రపంచం దోషిగా భావించిన వ్యక్తిని నిర్దోషిగా బయపడవేయడానికి ప్రభాకర్‌గారు తననితాను ఎంత కష్టపెట్టుకుంది కోర్టులో గమనించాను. న్యాయం ఎవ్వరికైనా ఒక్కటిగానే వుండాలి. నా భర్త నిర్దోషిగా బయటపడతాడన్న వాస్తవాన్ని అంగీకరించలేకపోతున్నాను. ఆత్మవంచన చేసుకుని జీవించడం ఇక నా వల్ల కాదు..."

ప్రభాకర్ డైరీ మూసివేశాడు. భారతికి తనంటే ఎందుకు ఇష్టం లేకపోయిందో ఇప్పుడర్థమయిందతనికి. గీతార్థ సారాన్ని అవగతం చేసుకున్న మౌనిలా కదిలాడు ప్రభాకర్.

***

లాయరుగా ప్రాక్టీసు మానివేసి శేష జీవితాన్ని ఆశ్రమంలో గడుపుతున్న ప్రభాకర్

ఎదురుగా ఓ అపరిచిత వ్యక్తి వుంది.

"ప్లీజ్ ఈ కేసు మీరు తప్ప ఇంకెవ్వరు తీసుకున్నా నా భర్త శిక్ష తప్పించుకోలేడు. నా మాంగల్యాన్ని కాపాడండి..." రేవతి అనే మరో అభాగ్యురాలు అతని కాళ్ళమీద పడి విలపించింది.

"ఐయాంసారీ! నేను ప్రాక్టీసు మానేశాను. అయినా ఈ కేసు నేను వాదించను. మీరిక వెళ్ళొచ్చు" నిష్కర్షగా అన్నాడు.

"మీరు పేరు మోసిన గొప్ప ప్లీడరు కావొచ్చు. కాని అవసరానికి పనికి రాని మీ ప్రతిభను ఆశించి ఇందాకా రావడం నా పొరబాటే. మిమ్మల్ని శపించడానికి నాకు అతీత శక్తులు లేక పోవచ్చు. కాని నా ప్రేమే గనుక పవిత్రమైనదయితే, అసలు ప్రేమ అనేపదానికి శక్తి అనేది వుంటే, మృత్యుముఖానికి దగ్గరలో వున్న ప్రేమికుడిని, నేనెంత ప్రాధేయపడినా రక్షించడానికి నిరాకరించిన మిమ్ము దహించి వేయక మానదు..." ఆమె ఆవేశంగా అన్నట్టు లేదు. ఆవేదన గోచరించిందా మాటల్లో.

ఆకాశంలో చంద్రుడు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నా ఎక్కడో కనీ కనిపించని మచ్చ ఆ వెనుక వుండనే వుంది.

ప్రభాకర్‌లో చలనం ప్రారంభమయ్యింది. భారతి వేసిన శిక్షకి అతని గుండె ఎప్పుడో శిలగా మారిపోయింది. కళ్ళలో నీరు ఇంకిపోయింది.

చర్చిలో గంట మ్రోగుతోంది.

రేవతి మాటలు అతని హృదయాన్ని తూట్లు తూట్లుగా చేయకముందే అతను చర్చి వేపు క దిలాడు.

ప్రేమకు మరణం లేదు. ప్రేమకే అంకితమయిన తనకి ఆ క్షణంలో రామ్మూర్తిలాంటి వ్యక్తులు కనిపించడం లేదు.

అప్పడతని కళ్ళెదుట ప్రేమమూర్తులు భారతి, రేవతే కనిపిస్తున్నారు.

ఆ క్షణానే అతడు నిర్ణయించుకున్నాడు, రేపు తను వాదించబోయే కేసు రేవతి భర్తదేనని.

ఆ విషయం తెలిసిన రేవతి ఆనందానికి అవధుల్లేవు. ఆకాశంలో చంద్రుడిని మబ్బులు కప్పివేయలేకపోయాయి.

ఆ తరువాత ప్రభాత భాస్కరోదయం అయ్యింది. కోర్టు గంట మ్రోగింది.

*